www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబర్ 2022
5
కాకినాడ



అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని అసాంఘిక కార్యక మాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని పెద్దాపురం డి.ఎస్.పి సుంకర మురళీమోహన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, గుండాట పేకాటలకు దూరంగా ఉండి, సాంప్రదాయ క్రీడలైన కబడీ వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహించుకోవచ్చు అన్నారు. పండుగ సందర్భంగా బంధువుల ఇళ్లకు వెళ్లేవారు ఇంటికి తాళం వేసుకొని విలువైన వస్తువులు ఆభరణాలు జాగ్రత్త పరుచుకోవాలని కోరారు. ప్రయాణించేటప్పుడు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100 నెంబర్‌కు డయల్ చేసి తక్షణమే తెలియపరచాలని అన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సిఐ కె కిషోర్ బాబు ఏలేశ్వరం ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్ ఉన్నారు.

ఎదుర్కోగలమా!

- మళ్లీ పొంచి ఉన్న కరోనా
- అధ్వానంగా జిజిహెచ్ కోవిడ్ కేర్ సెంటర్
- 50 పడకలు, 13 వెంటిలేటర్లను సిద్ధం : సూపరింటెండెంట్
- కరోనా తాకిడికి ఇవి సరిపోతాయా?



జిజిహెచ్‌లో కోవిడ్ కేర్ సెంటర్‌లో బయట పడేసిన బెడ్లు, మంచాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కరోనా ప్రభావం మరోసారి ఎదుర్కొగలమా అని ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుని నిర్ణయాలలో భాగంగా కోవిడ్ జాగ్రత్తలు తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల వ్యాప్తంగా కోవిడ్ టెస్ట్ లు చేయాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారిని, హోమ్ క్వారంటైన్ తప్పనిసరి చేయడంతో పాటుగా, వారికి కరోనా టెస్టులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కోవిడ్ ప్రభావం జిల్లాపై పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుం టున్నారు. అయితే కోవిడ్ ప్రభావం మరల పెరిగితే సౌకర్యాలు పూర్తిస్థాయిలో లేకపోవడం కాస్త ఆందోళనకు గురిచేసే అంశం.

తుప్పు పట్టిన పరికరాలు.. పనిచేయని ఆక్సిజన్ ట్యాంకులు

కరోనా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఎంహెచ్ ఓలకు వైద్య, ఆరోగ్యశాఖ సోమవారం ఆదేశాలు జారీచేసింది. కరోనా కేసులు పెరిగితే ఆస్పత్రుల్లో ఉన్న సదుపాయాలు, నియంత్రణ కోసం చేయాల్సిన ఏర్పాట్లు, సన్నద్ధతపై సమీక్షించుకోవడమే ఈ మాక్ డ్రిల్ నిర్వహణ ముఖ్య ఉద్దేశం. మాక్ డ్రిల్‌లో భాగంగా అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ ఆస్పత్రులు ఉన్నాయా.. లేదా.. అని పరిశీలిస్తారు. ఆయా ఆస్పత్రుల్లో ఐసీయు, ఆక్సిజన్, సాధారణ పడకల సామర్థ్యం, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్‌లో కరోనా పరీక్షల స్థానే ఆర్‌టిపిసిఆర్, ఆర్‌టిపిసిఆర్ కిట్స్, పరీక్షల నిర్వహణకు అవసరమైన రీఏజెంట్స్ సరిపడా అందుబాటులోఉన్నాయా.. లేదా.. అని చూస్తారు. అయితే జిల్లాలు విడిపోక ముందే కాకినాడ ప్రభుత్వాసుపత్రితో పాటుగా, జెఎన్‌టియుకె, అమలాపురం దగ్గర ఓడలరేవు, రాజమహేంద్రవరంలోని గవర్నమెంట్ హాస్పటల్, అమలాపురం కిమ్స్, కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి, కోవిడ్ టెస్టింగ్‌తో పాటు కోవిడ్ సోకిన వ్యక్తులకు ఈ సెంటర్లలో చికిత్స అందించడంతో, ఆక్సిజన్ కూడా ఏర్పాటుచేసి అత్యవసర చికిత్స అందించే వారు. రాను రాను కోవిడ్ ప్రభావం తగ్గుముఖం పట్టడంతోకుప్పెట్ కేర్ సెంటర్లను ఎత్తివేసి, అక్కడ పనిచేసిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా విధుల నుంచి తొలగించారు. అయితే అప్పుడు కోవిడ్ కేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పడకలు, మంచాలు, వెంటిలేటర్లు వంటి పరికరాలు తుప్పు పట్టి దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో అసలు కోవిడ్ కేర్ సెంటర్ ఉందా లేదా అన్న పరిస్థితిలోనే ఉంది. ఒకసారి అక్కడికి వెళ్లి చూస్తే తుప్పు పట్టిన పరికరాలు, పనిచేయని ఆక్సిజన్ ట్యాంకర్లు, పూర్తిస్థాయిలో పాడై పోయిన బెడ్లు, మొత్తంగా ఒకవేళ పడివేసి ఉన్నాయి. కోవిడ్ సోకిన వ్యక్తులకు 50 పడకలను ఏర్పాటు చేసి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలోనూ చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది నుంచి ఎటువంటి కోవిడ్ బాధితులు లేకపోవడంతో ఇది పెద్ద సమస్యగా కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల ప్రజలకు అత్యంత పెద్ద ఆసుపత్రి కాకినాడ గవర్నమెంట్ ఆసుపత్రి కావడం, ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం ఇప్పుడు ప్రజలను ఆందోళన కలిగించే విషయంగా మారింది.

కోవిడ్ టెస్ట్‌లు లు చేస్తున్నాం.. ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తున్నాం

● కాకినాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్

కాకినాడ ప్రభుత్వాసుపత్రులో 50, కోవిడ్ పడకలు, 13 అత్యవసర వెంటి లేటర్లు ఏర్పాటు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వా సుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించా, రానున్న రోజుల్లో ఎటువంటి పరికరాలు ఏర్పాటు చేయాలి, ఆక్సిజన్ సెంటర్లు పనిచేస్తున్నాయా లేదా అనే దానిపై పూర్తి వివరాలు సేకరించాం. ప్రజలకు కోవిడ్ ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 60 కోవిడ్ టెస్ట్‌లు నిర్వహించాం. ఎటువంటి పాజిటివ్ కేసులను నమోదు కాలేదు.



కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయని ఆక్సిజన్ ట్యాంకర్



అధ్వాన స్థితిలో ఉన్న ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ కేర్ సెంటర్



మహాసభను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర నాయకులు జగ్గు నాయుడు



సిఐటియు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్ష,కార్యదర్శులు, సభ్యులు

చట్టాలు, హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర నాయుడు జగ్గు నాయుడు

ప్రజాశక్తి - పిఠాపురం

చట్టాలు, హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమని సిఐటియు రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు అన్నారు. స్థానిక లయన్స క్లబ్ కళ్యాణ మండపంలో జరుగుతున్న సిఐటియు జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సిహెచ్.రాజ్‌కుమార్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెట్టారు. అనంతరం జగ్గు నాయుడు మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా కార్మికులు పలు హక్కులు, చట్టాలను సాధించుకున్నారన్నారు. నేడు బిజెపి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటుపరం చేసేందుకు యోచిస్తున్నా రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థల నిర్వీర్యంతో భవిష్యత్‌తరాలకు ఉపాధి అవకాశాలు దెబ్బతింటా యన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం, హక్కుల సాధన కోసం అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు హక్కులు, చట్టాల కోసం పోరాడాలన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎవి.నాగేశ్వరరావు, జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలపై ఐక్యంగా పోరాడాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు సమాన పనికి సమాన వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో జరిగే పోరాటాల్లో కార్మికులందరూ భాగస్వాములు కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, సిఐటియు తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, పౌర హక్కుల సంఘం నాయకులు జిఎస్.భాస్కర్, మల్లేశ్వరరావు సౌహర్ద సందేశాన్ని అందించారు. సభలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శేషబాబ్జి, బి.శ్రీనివాస్, ఎంవి.రమణ, కె.సత్తిరాజు, మేరీ, ఈశ్వరి, డి.క్రాంతికుమార్, పలివెల వీరబాబు, ఈశ్వరరావు, ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష,కార్యదర్శులు
దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శేషబాబ్జి, రాజ్ కుమార్

సిఐటియు కాకినాడ జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మహాసభ అనంతరం 43 మందితో కమిటీ ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, కోశాధికారిగా మలకా రమణ, ఉపాధ్యక్షులుగా ఇ.చంద్రా వతి, కె.సత్తిరాజు, జి.బేబిరాణి, కార్యదర్శు లుగా బాలం శ్రీను, సీహెచ్.పద్మ, డి.క్రాంతి కుమార్, దడాల పద్మ, గొల్లపల్లి రమణమ్మ, ఎన్.లలిత, రాజేశ్వరి, ఎన్.శ్రీను, నందీశ్వ రుడు, కొండల రావు, ఈశ్వరి, బాపూజీ, సిహెచ్.వెంకట్రావు, కుంచే చిన్న, విశ్వనాథం, సత్య నారా యణ, వీరవేణి, సురేష్, సత్యవతి, రాజేశ్వరి, సురేష్, ఇశ్రాయేల్, రాంబాబు, రొంగల ఈశ్వరర్రావు, ఎస్‌కె.పద్మ, ఎన్.శ్రీను, ధనలక్ష్మి, కామేశ్వరి, కో-అప్షన్ సభ్యులెన ఎన్నుకున్నారు.

తీర్మానాలు ఇవే...

మహాసభలో పలు తీర్మానాలను ఏకగ్రీవంఆ ఆమోదిం చారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణను వ్యతిరేకించాలని, రైతులకు కనీసం మద్దతు ధర కల్పించాలని, ఇపిఎఫ్-95 పెన్షన్లకు కనీస పింఛను రూ.9వేలు ఇవ్వాలని, డిఆర్ చెల్లించాలని, అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. మిడ్డేమీల్స్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేయాలని, ఆశా వర్కర్లకు కనీసం సౌకర్యాలు కల్పించి వేతనాలు ఇచ్చి, పని ఒత్తిడి తగ్గించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, మూసివేసిన పరిశ్రమలను తెరిపించాలని, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని, వలస కార్మికులకు వసతులు కల్పించాలని, శ్రామిక మహిళలు పనిచేసే చోట సుప్రీంకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని తీర్మానించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలని, స్కూల్ స్లిప్పర్స్ కి కనీస వేతనాలు అమలు చేయాలని, విఒఎల సమస్య పరిష్కరించాలని, సచివాలయం ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, వాలంటీర్లకు రూ.12వేలు వేతనం ఇవ్వాలని, ప్రయివేటు పాఠశాలలు, ఆసుపత్రిలో సిబ్బందికి కార్మిక చట్టాలు అమలు చేయాలని, ట్రాన్స్‌పోర్టు రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి, షాపింగ్ మాల్స్ కార్మికులకు కనీస వేతనాలు అలు చేయాలని, పట్టాభి ఆగ్రో, రాక్ సిరమిక్స్‌లో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, అధిక ధరలు తగ్గించాలని, మతోన్మాదాల దాడులు అరికట్టాలని తీర్మానించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



జెండాను ఆవిష్కరిస్తున్న లోవతల్లి

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 53వ ఆవిర్భావ దినోత్సవం సంద ర్భంగా కాకినాడ నగరవ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థు లకు క్రీడా-సాంస్కృతిక పోటీలు పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిం చారు. ముందుగా క్రీడ- సాంస్కృతిక పోటీలు ప్రారంభ సూచికగా ఎస్ఎఫ్ఐ స్వతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లోవతల్లి ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రాజా మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని, అందరికీ విద్య అందించాలని, చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని కోరుతూ 1970లో కేరళ రాష్ట్రంలో ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ నేటికీ 52 సంవత్సరాలు పూర్తి చేసుకుని 53వ వసంతంలోకి అడుగుపెడు తోందని 52 ఏళ్ల ఎస్ఎఫ్ఐ ప్రస్థానంలో అందరికీ విద్యా ఉపాధి కోసం పోరాడిందన్నారు. ఆ స్ఫూర్తితో నేటి విద్యార్థిని, విద్యార్థులులో ఉన్న ప్రతిభ ను వెలికి తీయడం కోసం వాళ్లలో ఉన్న క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం కోసం ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలకు పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆతిథ్యం ఇచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వర్మ రమణ మాట్లాడుతూ చదువు-క్రీడలు విద్యార్థులు సమానంగా రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా నగర, నాయకులు, పిఆర్ డిగ్రీ కళాశాల నాయకులు వరహాలు, సత్య ప్రసాద్, వెంకటేష్, శివ దుర్గ, హర్ష, మేరీ, యామిని, హంశ్రిత, పుష్ప, సంతోష, రమేష్, సతీష్, కార్తిక్, మదుల, సాయి, తరుణ్, చక్రి, జ్యోతి, నందిని, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో సత్వర న్యాయానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు చట్టం మేరకు పరిహారం అందజేయడంలోనూ సత్వర న్యాయం జరిగేలా చూడటంలోనూ జిల్లా అధికార యంత్రాంగం బాధ్యతాయుతంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొ న్నారు. బుధవారం కలెక్టరేట్ వివేకానందహాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు, డీఆర్‌వో కె.శ్రీధర్‌రెడ్డి, సమన్వయ శాఖల అధికారులు హాజరయ్యారు. జిల్లాలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసులు, విచారణలో పురోగతి, బాధితులకు సహాయం పంపిణీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వసతులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. తొలుత గత సెప్టెంబర్‌లో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలపై కార్యా చరణను సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జె.రంగలక్ష్మీదేవి వివరించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్) సమావేశాలు ఫలప్రదంగా జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా భోజనం, వసతి, చదువు పరంగా జిల్లాలోని ఎస్సీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కాకినాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల బాలుర వసతి గృహాన్ని కోటి రూపాయల ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అందుబాటులో ఉన్న స్థలం, అవసరాల మేరకు కొత్త నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. జగన్నాయక పురంలో రూ.40 లక్షల రిలయన్స్ నిధులతో 44 పడకలతో సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.



సమీక్షా సమావేశంలో ఎస్‌పి రవీంద్రనాథ్‌బాబుతో కలెక్టర్ కృతికా శుక్లా

శంఖవరం, కత్తిపూడి, తునిలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల కొత్త బ్లాకుల నిర్మాణాలకు ఇటీవల రూ. 1.77 కోట్లను జిల్లా ఖనిజ ఫౌండేషన్ నిధుల నుంచి మంజూరు చేసినట్లు వివరించారు. గత సమావేశంలో సభ్యుల విజ్ఞప్తి మేరకు జిల్లాలో షెడ్యూల్డు కులాల పేరుతో ఉన్న వీధుల పేర్లను మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నెలా చివరి శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్‌సి ఎస్‌టి ప్రత్యేక స్పందన నిర్వహిస్తున్నామని వీటిద్వారా 50-60 వరకు అర్జీలు వస్తున్నాయని వీటిని సత్వరం పరిష్కరిస్తున్నట్లు వివరిం చారు. అట్రాసిటీ కేసుల్లో చట్టం మేరకు త్వరితగతిన పరిహారం అందజేస్తున్నామని 2020 నుంచి ఇప్పటి వరకు బాధితులకు దాదాపు రూ.3 కోట్ల మేర పరిహారం అందించామని ఇటీవల రెండు కేసుల్లో రెండెకరాల చొప్పున వ్యవసాయ భూమిని కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు.

బాధితులకు భరోసా : ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో 2021లో 116 కేసులు నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 81 కేసులు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. 2013 నుంచి ఇప్పటి వరకు చూస్తే 45 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్నాయని వివరించారు. కేసుల్లో వీలైనంత త్వరగా ఛార్జిషీట్లు దాఖలు చేస్తున్నామని విచారణ త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించేలా క్షేత్రస్థాయి పోలీస్ యంత్రాంగానికి మార్గనిర్దేశనం చేసినట్లు వెల్లడించారు. డివిజన్ స్థాయిలో కూడా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నా యని వీటిలో పరిష్కారం కాని అంశాలను జిల్లాస్థాయి సమావేశాల దృష్టికి తీసుకొస్తున్నట్లు వివరించారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యులకు తనతోపాటు డీఎస్‌పీలు ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ఎస్‌పి వెల్లడించారు.

కీలక అంశాలపై సభ్యుల చర్చ:

సమావేశంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డోకుబుర్ర భద్రం, డాక్టర్ మోకా పవన్ కుమార్, బండి వీరలింగేశ్వరరావు, గంగవంశం త్రినాథ్‌దేవ్, పిల్లి జ్యోతితో పాటు ఎన్‌జీవో సంస్థల నుంచి ఎస్.పి.రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాకినాడలో పందుల పెంపకందారులకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేయాలని కోరగా అందుకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ డీపీవోకు సూచించారు. పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ చట్టంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సభ్యులు సూచించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యానికి భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో సభ్యుల విలువైన సూచనలను పరిగణనలోకి తీసుకొని అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విధానపర అంశాలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. సమావేశంలో కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, పెద్దాపురం ఆర్‌డీవో జె.సీతారామారావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్‌పీ అప్పారావు, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ డీఎస్ సునీత హాజరయ్యారు.



పాడైన పంట పొలాలను పరిశీలిస్తున్న జుబాబు

పాడైన పంటకు పరిహారం ఇప్పించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో పాడైన పంట పొలాలకు పరిహారం ఇప్పించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు డిమాండ్ చేశారు. పంట పొలాలకు పరిహారం ఇప్పించాలని ఇంజరం గ్రామానికి సంబంధించిన పలువురు రైతులు బొంతు అప్పారావు, పల్లసరయ్య, చింతాకుల చిరంజీవి, గుత్తుల రామకృష్ణ ఆరోపిస్తున్నారని రెవెన్యూ అగ్రికల్చర్ అధికారులు స్పందించి పరిశీలన చేసి పరిహారం ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఇంజరం గ్రామంలో పాడైన వరిచేలను ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు పరిశీలించారు. పలువురు రైతులు ఆయనతో మాట్లాడుతూ ఈ పంట కాలువ పైన ఉన్నటువంటి రొయ్యల చెరువుల యజమానులు కాళ్ల వరప్రసాద్, కాల వీర రామకృష్ణ వారి బంధువులు రొయ్యల చెరువులకు నీరు మార్చే క్రమంలో ఆ చెరువులో ఉన్నటువంటి ఉప్పునీరు పంట కాలువలోకి తోడడం వల్ల అది మా మా పంట చేలలో కలుసోందని రైతులు చీకట్ల నాగేశ్వరరావు, రేలంగి వెంకన్నబాబు, కురుపూడి సత్తిబాబు, అప్పారావు వేదుల కామేశ్వరరావు తదితరులు తెలిపారు.

కార్టూ'నిజం'





సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల సుబ్బారావు.

దళితులపై దాడులు చేస్తే పతనమే

- అనంతబాబుని ఎంఎల్‌సి నుంచి తప్పించాలి
- దాడులపై సీఎం మౌనం వీడాలి
-రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో దళితులపై దాడులు ఎక్కువ య్యాయని, దాడులు చేస్తే వారి పతనం ప్రారంభమవుతుందని వక్తలు అన్నారు. అలాగే దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన అనంత బాబును ఎంఎల్‌సి పదవి నుంచి తప్పించాలని, ఇంత జరుగుతున్నా సీఎం జగన్ ఎందుకు మౌనంగా ఉంటున్నారో వివరించాలని వారు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ అంబేద్కర్ భవన్లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల ప్రతినిధులతో ఎస్‌సి ఎస్‌టిలపై దాడులు హత్యలు- చట్ట పరమైన మార్గాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఎస్సీ ఎస్టీ జేఏసీ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు.

కాకినాడలో ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మ ణ్యంను హత్య చేసి వారి ఇంటికే డోర్ డెలివరీ చేసినా అతన్ని ప్రభుత్వం ఎంఎల్‌షి పదవి నుంచి తప్పించకుండా, అతనికి శిక్ష నుండి కాపాడేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తూ వస్తోందన్నారు. సరైన సమయానికి పోలీసులు తగు నివేదన అందజే యకుండా కాలయాపన చేస్తూ కోర్టులను తప్పుదారి పట్టించారన్నారు. 200 రోజులు అనంతరం అతనికి కోర్టు నిబంధనలతో కూడిన బెయిల్ ఇస్తే వైసిపి ప్రభుత్వానికి చెందిన పెద్దలు, నాయకులు భారీ స్వాగతాల మధ్య ఊరే గింపుగా తీసుకువెళ్లడం వెనుక ఆంతర్యం ఏంటో చెప్పాలన్నారు.

అనంతబాబును కాపాడేందుకు తొలి నుండి జిల్లా ఎస్‌పి సహకరించా రన్నారు. జిల్లా ఎస్‌సి తొలి నుండి అనంత బాబుపై కేసులను నమోదు చేయకుండా ఎన్నో అబద్ధాలు చెప్పారని వక్తలు పేర్కొన్నారు. అట్రాసిటీ చట్టంపై అవగాహన లేని పోలీసులు వల్ల ఎస్సీలతోపాటు గిరిజనులు కూడా చాలా అన్యాయం జరుగుతోందన్నారు. అట్రాసిటీ చట్టాన్ని తప్పుదారి పట్టిస్తున్న పోలీసులపై ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అనంతబాబు, ఎంఎల్‌ఎ ధనలక్ష్మి ఫోటోలతో కూడిన కర పత్రాన్ని ముద్రించి ఇంటిం టికి పంచడం, ఆయన లేకుండా సభల్లో అతను గురించి గొప్పలు చెప్పడం ఏంటో వైసీపీ పెద్దలు నోరు విప్పాలని చెప్పారు. అనంతబాబు ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో అక్రమాలు చేశారని అతను జైలు కెళ్లిన తర్వాత ఆ ప్రాంత గిరిజనులు ఇప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్టుగా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అటువంటి అనంతబాబుకి జైలు నుంచి వస్తే పూల వర్షంతో స్వాగత ద్వారం ఏర్పాటు చేయడం వెనక ఆంతర్యంతో చెప్పాలన్నారు. తక్షణమే వీధి సుబ్రహ్మణ్యం హత్యపై సీబిఐ విచారణ జరగాలని దానికి ప్రభుత్వం సహకరించాలని, అతని సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, బాదిత కుటుంబానికి అండగా నిలవాలని వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అట్రాసిటీ చట్టంపై తాము అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2019 నుండి 2022వ సంవత్సరం వరకు జిల్లాలో 784 అట్రాసిటీ కేసులు నమోదవుతే కేవలం 30 కేసులో మాత్రమే పోలీసులు చార్జిషీట్ను దాఖలు చేశారన్నారు. పోలీసులు తీరు వల్ల, వహిస్తున్న నిర్లక్ష్యం వల్ల ఎన్నో కేసులు నమోదు కావడం లేదన్నారు. చట్టంపై అవగాహన లేని పోలీసులపై చర్యలు తీసుకోవాలని మాట్లాడిన వక్తలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ముప్పాళ్ళ సుబ్బారావు, జంగా గౌతమ్, కేఎస్ శ్రీనివాస్, కొండేపూడి ఉదయ్ కుమార్, పిట్టా వరప్రసాద్, బచ్చల కామేశ్వరరావు, గుడాల కృష్ణ, సబ్బతి ఫణేశ్వరరావు, తుమ్మల నూకరాజు, తాడి బాబ్జి, కాశి బాలయ్య, కొల్లాబత్తుల అప్పారావు, మాతా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీఒ విక్టర్

జనవరికి 50 శాతం పన్ను వసూలు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

గ్రామ స్వరాజ్యానికి పంచాయతీలు పట్టుకొమ్మలని, పన్నులు సకాలంలో వసూలు చేసి ఆర్థిక పరిపుష్టం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమీక్షా సమావేశం బుధవారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం డిపిఒ విక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇంటి, ఆస్తి, ఖాళీ జాగాలు, చెత్త పన్నుల వసూళ్లపై కార్యదర్శులు దృష్టి పెట్టాలని, నూటికి నూరు శాతం వసూళ్లు సాధించాలని డిపిఒ సూచించారు. వాడుకలో లేని ఇళ్లకు పన్ను మినహాయింపు లేదని స్పష్టం చేశారు. పన్నుల తగ్గింపుపై కార్యదర్శులకు ఎటువంటి అధికారాలు లేవన్నారు. ఏదైనా కోర్టు ఆదేశాలు ఉంటే తప్ప ఖచ్చితంగా వసూళ్లు చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీల వారీగా ప్రగతిని సమీక్షించారు. సమావేశంలో కాకినాడ డిఎల్‌పిఒ అమ్మాజీ, పెద్దాపురం డిఎల్‌పిఒ బాలమణి, డిపివో కార్యాలయ ఏఒ శ్రీరామ్, అర్జున్, సుమారు 170 పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్యదేవునికి రూ.1.84 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి హుండీల లెక్కింపుగా ఆదాయం రూ.1,84,88,599 లభించింది బుధవారం కొండ పైన దేవస్థానం ఇఒ ఎన్ఎస్ఎన్ మూర్తి, చైర్మన్ ఐ.వి. రోహిత్ సమక్షంలో దేవస్థానం అధికారులు 26 రోజుల్లో వచ్చిన హుండీల ఆదాయం లెక్కించారు. కరెన్సీతో పాటుగా 43 గ్రాములు బంగారం 30 గ్రాములు వెండి ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది కార్యక్రమంలో ఏసీ రమేష్ బాబు వివిధ విభాగాల ఏ ఈవోలు ఇంజనీరింగ్ అధికారులు,బి.ఆర్.ఓ డి.వి.ఎస్ కష్టారావు, వ్రత పురోహితులు శ్రీవారి సేవకులు సిబ్బంది పాల్గొన్నారు



ఇఒ, చైర్మన్ సమక్షంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ఇక రత్నగిరిపై ఉచిత కేశ ఖండన

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానం రత్నగిరిపై కేశఖండన శాల నిర్వాహకులు తలనీలాలు సమర్పించే తమ నుండి గుండుకు 50 రూపాయలు డిమాండ్ చేస్తున్నారని సోమవారం అధికారులు నిర్వహించిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో "మంలో కొంతమంది భక్తులు ఫిర్యాదు చేసిన అంశంపై" ప్రజాశక్తి దినపత్రికలో 'గుండు గీయించు కుంటే 50 ఇవ్వాల్సిందేనా' వార్త ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీనిపై దేవస్థానం అధికారులు స్పందించారు. ఆరోజు నుండి కొండపైన తలనీలాలు (గుండు) సమర్పించేవారు వారు ఎవరైనా కేశ ఖండన నిర్వాహకులకు ఎటువంటి డబ్బులు ఇవ్వనవసరం లేదని, కొండపైన దేవస్థానం అధికారులు మైకుల్లో ప్రచారం చేస్తున్నారు. అంతేకాక ప్రజాశక్తి లో వచ్చిన వార్తపై రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హరి జవహర్ లాల్ కూడా దేవస్థానం అధికారులకు ను వివరణ కోరినట్లు తెలిసింది. .అయితే కొండపైన భక్తులు కేశఖండన శాల నిర్వాహకులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వనవసరం లేదని ప్రచారం ఎన్నాళ్లు చేస్తారో..... ఆ సత్యదేవునికే ఎరుక..!

మరిడమ్మ హుండీల ద్వారా రూ 4.36 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


పెద్దాపురం మరిడమ్మ ఆలయ హుండీలను బుధవారం లెక్కించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ రామ్మోహన్రావు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 18 నుండి ఈనెల 27వ తేదీవరకు 132 రోజులకు సంబంధించిన హుండీల ఆదాయాన్ని లెక్కించారు. దేవాలయ అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ పెద్దాపురం డివిజనల్ ఇన్స్పెక్టర్ చల్లా ఉదయ బాను నాయుడు, కాకినాడ శ్రీ భాను లింగేశ్వర స్వామి దేవస్థానం ఇఒ ఎంఎం వీరభద్రరావుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించగా రూ 4,36,627 ఆదాయం సమకూరిందన్నారు. కార్యక్రమంలో పోలీసులు, వీఆర్వో, సిబ్బంది, శ్రీనివాస భక్తమండలి, సాయి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు ఆందోళన చెందొద్దు : డిఎం పుష్పమణి

ప్రజాశక్తి - కోటనందూరు

తుపాను ప్రభావంతో తడిసిపోయిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని సివిల్ సప్లయిస్ డిఎం అధికారిని పుష్ప మణి రైతులకు భరోసా ఇచ్చారు. దళారులకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతులకు లేదని రైతు భరోసా కేంద్రాల ద్వారా పండించిన ప్రతి ధాన్యపు గింజను తడిసిన ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. కోటనందూరు మండలంలో అధిక వర్షాల వల్ల వరి పంట అధికంగా తడిసిపోవడంతో ధాన్యము జీలు జల్లెడ పోవడం వల్ల రైస్ మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారని వల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై అధికారి డిఎం పుష్పమణి బుధవారం నాడు మండల కేంద్రమైన ఎంపీ డీవో కార్యాలయంలో మిల్లర్లతోనూ ప్రజాప్రతినిధులతోనూ, రైతులతోనూ అవగాహన సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుష్ప మణి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ తడిసిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని రైతులకు మిల్లర్లకు సమన్వయం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఎంపిపి ఎల్. శ్రీనివాస్, వ్యవసాయ మండల అడ్వైజర్ కమిటీ చైర్మన్ సుర్ల రాజు, లంక ప్రసాద్, ఆర్డీఓ సీతారామ రావు, ఇన్ఛార్జి తహశీల్దార్ ఎస్. కిరణ్ కుమార్, ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పి ఎం రవీంద్రనాథ్ బాబు

ఆర్‌టిసి డ్రైవర్‌కు సత్కారం

- పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాకినాడ

వివిధ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్న కాకినాడ ఆర్‌టీసీ డిపోకు చెందిన డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావును కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బుధవారం కలెక్టరేట్‌లో సత్కరించారు. ఈ ఏడాది నవంబర్‌లో నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 7వ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పవర్ లిఫ్టింగ్ 150 కేజీల విభాగంలో 450 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావు భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా ఉద్యోగ బాధ్యతలను మార్చాలని, ప్రాక్టీస్ కోసం ఎక్విప్ మెంట్ అందజేయాలని, అదే విధంగా ఇంటి స్థలం మంజూరు చేయాలంటూ జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు భద్రం మాస్టారు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

రోడ్లపై పందులు తిరిగితే చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో పందులు బహిరంగంగా తిరిగితే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ కృష్ణ మూర్తి, వైస్ చైర్మన్ ఉబా జాన్ మోజస్ లు పందుల పెంపకం దారులను హెచ్చరించారు. బుధవారం సాయంత్రం చైర్మన్ చాంబర్‌లో పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ అరుణ కృష్ణ మూర్తి, వైస్ చైర్మన్ మోజస్ లు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో పలువురు రోగాల బారిన పడుతున్నారని, పందులు బయట సంచరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దీనిపై పందుల పెంపకం దారులు మాట్లాడుతూ పందులు పెంచుకునేందుకు తమకు ఊరు చివర స్థలం ఇస్తామని ప్రకటించారని, అలా చేస్తే పందులను ఆ ప్రాంతానికి తరలిస్తామన్నారు. దీనిపై మోజస్ మాట్లా డుతూ ప్రస్తుతం స్థలం ఇవ్వలేమని, ఎవరి సొంత స్థలాల్లో వారు ఉంచాలని 10 రోజుల తరువాత పందులు బయట కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసు, వైసీపీ నాయకులు నమ్మి శ్రీను, రెడ్డి శ్రీని వాసు, చిట్టిమాని శ్రీను పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పూర్తికి ఆదేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె. రమేష్ బుధవారం సాయంత్రం గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేకాధికారులతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కొమరగిరి లో జరుగుతున్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 1569 ఇళ్లకు సంబంధించి అధికారులకు సూచనలు ఇచ్చారు. బేస్మెంట్ స్థాయి పూర్తయిన ఇళ్లను తదుపరి నిర్మాణ ప్రక్రియ పై, బ్యాంక్ లింకేజీపై దష్టి పెట్టాలని కోరారు.. స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్న గహ నిర్మాణ లబ్ధిదారులకు రూ. 35 వేలు చొప్పున తోడ్పాటు నిచ్చే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 4283 మందికి బ్యాంకు లింకేజీ అందిందని, మరో 5409 మందికి మంజూరు కావలసి ఉందని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం. ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, పలువురు ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఆదిత్య ఫార్మసీ కళాశాలకు ఎన్ఎఎకె -ఎ గుర్తింపు

ప్రజాశక్తి -గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య క్యాంపస్ నందు గల ఆదిత్య ఫార్మసీ కళాశాలకు ఎన్ఎఎకె (నాక్ - ఎ)గుర్తింపు లభించినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలియజేసారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారు కళాశాలలో గల ల్యాబ్,లైబ్రరీ, ఉపాధ్యాయ,ఉపాధ్యాయేతర సిబ్బంది మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరీక్షించిన త్రిసభ్య బందం సిఫారసు మేరకు తమ ఆదిత్య ఫార్మసీ కళాశాలకు ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. తమ కళాశాలకు 3.06/4.0 తో గుర్తింపు రావడం ఆనందదాయకమని అందుకు కృషిచేసిన అధ్యాపక బందానికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ డి. సతీష్ కుమార్, డాక్టర్ కె.రవిశంకర్ పాల్గొన్నారు.



గురుబ్రహ్మ అవార్డు అందుకుంటున్న ప్రసాద్

నృత్యకారుడు ప్రసాద్‌కు గురుబ్రహ్మ అవార్డు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి మహతి ఆడిటోరియంలో కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ప్రముఖ కూచిపూడి నత్య కళాకారుడు అలమండ ప్రసాద్‌ను శ్రీగురు బ్రహ్మ అవార్డు - 2022 ఇచ్చి ఘనంగా సత్కరించి అభినందించారు. తిరుపతిలో ఆర్కె కళా సాంస్కతిక ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన అదివో అల్లదివో నత్య ఉత్సవాలకు ప్రసాద్ హాజరై కూచిపూడి నత్య ప్రదర్శన ఇచ్చి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రసాద్ నత్య ప్రదర్శనకు అభినందిస్తూ శ్రీ గురుబ్రహ్మ అవార్డు 2022 ను విజయవాడ నాని సేవాదళ్ నిర్వాహకులు ఆకుమల్ల నాని మ్యూజిక్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం ముని రత్నం, మహతి ఎలక్ట్రికల్ ఇంజనీర్ వి.దొరస్వామి అందజేసి దుశ్శాలువాతో మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నత్యకారుడు ప్రసాద్‌ని పలువురు ప్రముఖులు రాజకీయ నాయకులు సత్యం సంస్థలు ప్రతినిధులు పారిశ్రామికవేత్తలు కళాకారులు అభినందించారు.



ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ప్రభావతి

ప్రభావతికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

గాయత్రీ వాకర్స్ క్లబ్ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తున్న స్వర్ణదాత ఎం.ప్రభావతికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఇటీవల నెల్లూరులో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ సంఘ సదస్సులో ఈ పురస్కారాన్ని గజల్ శ్రీనివాస్ అందజేశారు. అంతర్జాతీయ వాకర్స్ సంఘ అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గాయత్రి వాకర్స్ క్లబ్ ద్వారా వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాకర్స సంఘానికి విరాళాలు సేకరించిన సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు తుని పట్టణ సిఐ ఎం.నాగ దుర్గారావు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వీరప్ప ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి నుండి బొలేరో వాహనంలో గంజాయి తరలిస్తుండగా బుధవారం సాయంత్రం తుని సమీపంలో సీతారాంపురం వద్ద అదుపులోకి తీసుకున్నా మన్నారు. సుమారు 80 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, బొలెరో వాహనాన్ని సీజ్ చేశామన్నారు. గంజాయి విలువ రూ.లక్షా 60 వేలు విలువ ఉంటుందని అన్నారు. ఈ దాడిలో ఎస్ఐ ఏ.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు ఏలేశ్వరం డిపో ఎదుట రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష కార్యదర్శులు కెఎస్‌కె రావు, కేత్రిమూర్తులు మాట్లాడుతూ ఓటీలు చెల్లించనటువంటి డ్యూటీలను స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగా మార్చాలని, కేంద్ర కార్యాలయం ఇచ్చిన 1/19 సర్క్యులర్ అమలు చేయాలని, ఎనిమిది గంటల పని దినాలను కచ్చితంగా పాటించాలని, మహిళ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో జి ఏ రాజు, ఎస్ వి రమణ, కె వి రావు, చింతపల్లి సతీష్, ఎడిసి చెన్నారావు, పల్లి వీరబాబు, రంగంపేట శ్రీను పాల్గొన్నారు.

యుటిఎఫ్ సంక్షేమ పథకం చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కీర్తిశేషులు ఎం సీతామహాలక్ష్మి సంస్మరణ సభ నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు యు సూర్య నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీపీ పెంకే సత్యవతి, జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సభలో సీతా మహాలక్ష్మి మతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం ఎంపీపీ సత్యవతి, జడ్పీటీసీ సూరిబాబు,యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి ప్రభాకర్ వర్మలు ఆమె కుటుంబ సభ్యులకు రూ.3 లక్షలు యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథక సంఘీభావ చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి జి గోవిందరాజులు,పెద్దాపురం మండల విద్యాశాఖ అధికారి పీవీ సత్యనారాయణ,యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి చంద్రశేఖర్,జిల్లా కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ కె ఎస్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

టవర్ నిర్మాణానికి స్థల సేకరణ

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని రాఘవపట్నం. జల్దాం. మాతియ్యా పేట. ఎస్ పైడిపాల తదితర గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణానికి స్థల సేకరణ నిమిత్తం తహశీల్దార్ ఎల్.శివకుమార్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో కమ్యూనికేషన్ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సెల్ టవర్ నిర్మాణాం చేపట్టనున్నట్టు ఒక ప్రకటనలో తహశీల్దార్ శివకుమార్ తెలిపారు.

జెఎన్‌టియుకెలో సిహెచ్ఎస్ఎన్ 3వ అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి- కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణంలో జెఎన్ టియుకె, విశాఖపట్నం ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో ఇన్ఫర్మాటిక్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ (ఐబిసిబి), ప్రొఫెసర్ సిహెచ్ఎస్ఎన్ రీసెర్చ్ ఫౌండేషన్, హైదరాబాద్‌లోని బయో యాక్సిస్ డిఎన్ఏల సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సిహెచ్. సత్యనారాయణ సంస్మరణార్థం కంప్యూటర్ విజన్, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, స్మార్ట్ డివైజస్ అండ్ నెట్వర్క్స్ (సిహెచ్ ఎస్ఎన్-2022) అను అంశంపై మూడవ అంతర్జాతీయ సదస్సు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు బుధవారం సెనేట్ హాలులో నిర్వహించిన ప్రారంభ సదస్సులో ముఖ్యఅతిథిగా ఉపకులపతి జివిఆర్.ప్రసాద రాజు, విశిష్ట అతిథులుగా జెఎన్ టి యుకె విశ్వవిద్యాలయం మొదటి ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం అప్పారావు, అమెరికాలోని ఆన్‌లైన్ వీసా సిఇఒ డాక్టర్ జాన్ కె. వెల్లీ, అమెరికాలోని వాల్డెన్ యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు బి.కొర్రపాటి, యూనివర్శిటీ టెక్నికల్ మలేషియా మెలాకా సీనియర్ లెక్చరర్లు డాక్టర్ వరూషియా యాషిన్, డాక్టర్ జురాయిదా, డాక్టర్ జహేరా, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ రుచికా మల్హోత్రా హాజరయ్యారు. జెఎన్ టియుకె రిజిస్ట్రార్ ఎల్. సుమలత కాన్ఫరెన్స్ జనరల్ ఛైర్‌గా వ్యవహరించగా, డిఎంసి స్పెషల్‌ఆఫీసర్ ప్రొఫెసర్ ఏ.ఎస్.ఎన్. చక్రవర్తి సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఉపకులపతి ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుండి జెఎన్ టియుకెలో సిఎస్‌ఈ విభాగంలో ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ కోర్సులను ప్రారంభిస్తారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సైబర్ సెక్యూరిటీలో ఎంటెక్ కోర్సును ప్రారంభించామన్నారు. జెఎన్టీయుకె తొలి ఉపకులపతి అల్లం అప్పారావు ప్రస్తుతం ట్రాన్స్ డిసిప్లినరీ విధానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. యుజి స్థాయిలోనే విద్యార్థులు పేపర్లు రాసేలా వారిని ప్రోత్సహించాలని యూనివర్శిటీ అధికారులను కోరారు. వాల్డెన్ యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు బి. కొర్రపాటి పరిశోధనలో ఐదు అధ్యాయాల నమూనా గురించి ఆయన వివరించారు. ఆన్‌లైన్ వీసా సిఇఒ డా.జాన్ కె.వెల్లీ మాట్లాడుతూ అన్ని రంగాలలో కృత్రిమ మేధ ఉపయోగంపై వివరించారు.

రిజిస్ట్రార్ ఎల్.సుమలత మాట్లాడుతూ వివిధ దేశాల నుండి సిహెచ్ఎస్ఎన్–2022 సదస్సుకు 160 పరిశోధనా పత్రాలు వచ్చాయని, వీటిలో 44 పత్రాలను స్ప్రింగర్ జర్నల్ ప్రచురించడానికి అంగీకరించినట్లు తెలిపారు. పబ్లికేషన్స్, పేటెంట్లు, ప్రాజెక్టు, పిహెచ్‌ఐ.లలో గణనీయమైన కృషి చేసిన ఉత్తమ మహిళా పరిశోధకులు, యువ పరిశోధకులను ఆమె అభినందించారు. మలేషియాలోని యూనివర్శిటీ టెక్నికల్ మలేషియా మెలాకా సీనియర్ లెక్చరర్లు వరూ షియా యాషిన్, జురాయిదా, జహేరా, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ రుచికా మల్హోత్రా, థాయిలాండ్ లోని హహిడోల్ యూనివర్శిటీ నుండి డాక్టర్ వోరపన్ కుసకున్నిరన్, ఇండోనేషియాలోని మాతరం యూనివర్శిటీ నుండి విజయ సుత తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. అనంతరం సావనీర్ ఆఫ్ కాన్ఫరెన్సును, దివంగత ప్రొఫెసర్ సత్యనారాయణ సంపాదకత్వంలోని మూడు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. బెంగుళూర్ రేవా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ కుమార్ రాజా, విఐటి అమరావతి నుండి డాక్టర్ సాయి చందన, డాక్టర్ హరి కిరణ్, డాక్టర్ సయ్యద్ ముజ్జాహుల్ బాషాలకు ఉత్తమ పరిశోధక అవార్డులను, ఉత్తమ మహిళా పరిశోధకురాలిగా హైదరాబాద్ లోని గోకరాజు రంగరాజు కళాశాలకు చెందిన డాక్టర్ సుష్మిత వల్లీకి అతిథులు అవారుడ్లను ప్రదానం చేశారు. ఈ సదస్సులో జెఎన్టియుకె డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, పరిశోధక, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ సత్యనారాయణ సంపాదకత్వంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విసి ప్రసాద్ రాజు ముఖ్య అతిథులు

పారదర్శక పాలనే జగన్ లక్ష్యం



ప్రమాణం చేస్తున్న మార్కెట్ కమిటీ కార్యవర్గం

ప్రజాశక్తి - గండేపల్లి

అన్ని వర్గాలకు సముచిత స్థానం అందిస్తూ పారదర్శక పాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోనరెడ్డి ఉన్నారని రాష్ట్ర మార్కెటింగ్ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జడ్ రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా జనపరెడ్డి సుబ్బారావు అనే బాబు మరో పదహారు మంది డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే రాష్ట్ర సంక్షేమంగా భావించి ముఖ్యమంత్రి జగన్ సుమారు 75 శాతం నిధులను వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నారన్నారు. శాఖా పరంగా జగ్గంపేట నియోజకవర్గానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానన్నారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ 50 లక్షల మంది రైతులు ఉండగా నేడు సుమారు 85 శాతం కౌలు రైతులు పంటలు పండిస్తున్నారని వారిని ఆదు కోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ నేడు ఎన్నికలు జరిగినా 175 కి 175 సాధించే విధంగా జగన్ పాలన సాగుతుందన్నారు. కురసాల కన్నబాబు మాట్లాడుతూ వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, మండల, జిల్లా రాష్ట్రస్థాయి కమిటీలతో వచ్చే ఎన్నికల్లో 175కి 175 సాధించడం తథ్యమన్నారు. ఎంఎల్ఎ చంటి బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతిపక్షానికి అవకాశం లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్నామని పార్టీ, కులం, మతం, ప్రాంతం, బేధాలు లేకుండా జగన్ రెడ్డి అందించిన పథకాలే తమ విజయానికి నాంది పలుకుతాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, డిసిసిబి చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర పెరికి సంఘం చైర్మన్ పురుషోత్తం గంగాభవాని, మండల అధ్యక్షులు, కమిటీల డైరెక్టర్లు, గండేపల్లి జడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు కందుల చిట్టిబాబు, గ్రామ సర్పంచ్ మురారి గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్‌లు, మండల యువ నాయకులు జాస్తి వసంతం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై చర్చకు సిద్ధం

- యనమలకు... మంత్రి దాడిశెట్టి సవాల్

ప్రజాశక్తి - కోటనందూరు

రాష్ట్రం అప్పుల పాలు అయిపోయిందని రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చలకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని యనమల రామకష్ణుడు అనడం హాస్యాస్పదమని రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. బుధవారం తుని పట్టణంలో మర్చంట్ అసోసియేషన్ జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై చర్చికి నేను సిద్ధమని ప్లేసు టైము మీరే డిసైడ్ చేయాలని యనమల రామకృష్ణుడికి మంత్రి రాజా సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడు పరిపాలనలో ప్రజల నుండి పనుల రూపంలో వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయలు ప్రజా ధనాన్ని చంద్రబాబు నాయుడు ఎల్లో మీడియా, ఆయన అనుచరులకు దోశ పెట్టారని, నీరు చెట్టు పథకం ద్వారా కూడా పనులు చేయకుండానే 25 కోట్ల రూపా యలు బిల్లులు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించింది అని గుర్తు చేశారు.100 కోట్ల ఖజానాతో జగన్ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు అప్పగించారని అన్నారు. మూడున్నర సంవత్సరాల పరిపాలనలో నాడు నేడు, విద్య ఆరోగ్యం, నవరత్నాల అమలు పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 1.30 కోట్ల రూపాయలు ప్రభుత్వం అప్పు చేసిందని ఆయన అన్నారు. జగన్ పాలన ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా చంద్రబాబు, యనమల చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో తుని పట్టణ మున్సిపాలిటీ చైర్మన్ ఏలూరు సుధా రాణి బాలు, మచ్చంట అసోసియేషన్ కుసుమంచి సుబ్బరాయుడు, అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, పామర్తి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

ముగిసిన ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె ప్రాంగణంలో జెఎన్టియుకె డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటుచేసిన ఇన్నోవేషన్ ఫెయిర్ ఎగ్జిబిషన్ బుధవారంతో ముగిసింది. అలూమ్ని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ జి.వి.ఆర్. ప్రసాద రాజు, అతిథులుగా రెక్టార్ ప్రొ. కెవి.రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలతలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఐఎస్టి, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొ.ఏ.గోపాలకష్ణ అధ్యక్షత వహించి స్వాగతం పలికారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళాశాలల నుండి 175 నమూనాలను ప్రదర్శించినట్టు డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొ.ఏ. గోపాలకష్ణ తెలిపారు. ప్రదర్శనలో ఉత్తమ నమూనాలకు బహుమతులను అంద జేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వ హయాంలోనే హార్బర్ మంజూరు

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 300 కోట్లతో హార్బర్ నిర్మాణానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, ప్రభుత్వం మారడంతో హార్బర్ పనులు. నిలిచిపోయాయని అనిపితాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ న్ వర్మ అన్నారు. కొత్తపల్లి మండల ఉప్పాడ హార్బర్ ను మత్స్యకారుల నాయకులతో కలిసి బుధవారం సందర్శించి, హార్బర్ ప్రస్తుత స్థితిగతులు కోసం తెలుసుకున్నారు అనంతరం వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి గతి లేని ఉప్పాడ హార్బర్ నిర్మాణం, సీఎం జగన్ శంకుస్థాపన చేసి రెండేళ్లయినా అడుగు కూడా ముందుకు కదలని హార్బర్ నిర్మాణం, 442 కోట్ల అంచనా వ్యయంతో రెండేళ్ల కిందట సీఎం జగన్ శంకుస్థాపన చేశారని. ఇప్పటికీ 10 శాతం కూడా పూర్తి కాకపోవడంతో హార్బర్ నిర్మాణం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. హైదరాబాద్ కు చెందిన ఎం.ఆర్.కె.ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీ ఉప్పాడ హార్బర్ నిర్మాణ కాంట్రాక్టు, కొత్తగా నిర్మించే మరో మూడు హార్బర్ పనులు కాంట్రాక్టు కట్టబెట్టడంతో పనులు సాగడం లేదన్నారు. ప్రస్తుతం ఈ కంపెనీ నెల్లూరులోని జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణం చేపడుతున్న అది పూర్తయిన తర్వాత గాని ఇటువైపు రావడానికి కాంట్రాక్టర్, ఇష్టపడటంలేదని ఆరోపించారు. ఈ ఏడాది జనవరిలో అమరావతి నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు, హార్బర్‌ను పరిశీలించి 2023 మార్చినాటికి అర్బన్ పూర్తి చేస్తామని గొప్పలు పలికి వెళ్లారన్నారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానంద రెడ్డి, మేరుగు భూషణం, చొక్కా దావీద్, చోడిపల్లి ప్రసాద్, సీకోటి నానాజీ, ఒసిపల్లి అప్పన్న, తిక్కాడ తాతారావు, సురాడ శ్రీను, అప్పారావు, మేరుగు తాతారావు, బొందు జగన్నాధం, మత్స్యకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరంలో వివిధ పాఠశాలలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులకు బుధవారం ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం సాయి వేదిక కళ్యాణ మండపంలో గ్రామ వాలంటీర్లు పార్టీ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పరిశీలకులు కుడుపూడి భరత్ చైర్ పర్సన్ అలమండ సత్యవతి, జడ్పిటిసి నీరుకొండ రామకుమారి, ఎంపీటీసీలు కౌన్సిలర్లు, సర్పంచులుపాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలం ఇంజరం, పిల్లంక ,సుంకరపాలెం, పటవల ప్రభుత్వ పాఠశాలలో ఎంపిపి సునీత విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. ఇంజరంలో101, పిల్లంకలో 28 సుంకరపాలెంలో 31 పట వల హైస్కూల్లో 70 ట్యాబ్‌లు అందించారు. జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు లంకె చంద్రావతి, మాచరరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** మండలం కొమరగిరి జడ్‌పి హైస్కూలు చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు 68 మందికి అలాగే ఐదు ఉపాధ్యాయులకు వైసిపి నాయకుడు నక్క శ్రీనివాసరావు, హై స్కూల్ కమిటీ వై చైర్మన్ కే వరలక్ష్మి ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ పాఠశాలలో నిర్వహిస్తున్న, భౌతిక, గణిత, జీవశాస్త్రం ఉపాధ్యాయులకు కాకినాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఆన్లైన్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణకు 105 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా చివరి రోజు ముఖ్యఅతిథిగా కాకినాడ జిల్లా సైన్స్ అధికారి వినీల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగస్త్య సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థి సంపూర్ణ వికాసం కోసం, క్రియాధారిత విద్యను ప్రోత్సహించే విధానంలో భాగంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సంస్థ ద్వారా కుప్పం వేదికగా విజ్ఞాన శాస్త్ర అభివద్ధిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రమణ్యం, కాకినాడ జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస రావు, అగస్త్య శిక్షణ ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగరాజు, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి వివిధ రూపాల పోరాటాలను నిర్వహిస్తున్నట్లు ఏపీ జిఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆస్కరరావు అన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆస్కారరావు రాష్ట్ర అధ్యక్షునిగాను ఏలేశ్వరానికి చెందిన కె.భాస్కరరావు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కావడంతో బుధవారం సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ఎంవివి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక లారీ ఓనర్స్ భవన్‌లో వారిని వైద్య ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్తిపాడు తాలూకా వైద్య ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రత్తిపాడు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్వి రమణ, సత్యవేణి, ఉపాధ్యక్షులుగా బిబిఆర్ ప్రసాద్, అప్పారావులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తిరగటి వీరన్న, సిహెచ్‌ఓ మాణిక్య కుమారి, ఏసుబాబు, జగదీష్ స్టాఫ్ నర్సులు ఏఎన్ఎంలు వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.